ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
మంగళవారం 2 జనవరి 2024

అంబరాన్నంటిన సంబరం - వాడవాడనా న్యూ ఇయర్ వేడుకలు 8
7 రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

లక్ష్యానికి దూరంగా కొనుగోళ్లు

- జిల్లాలో పౌరసరఫరాల శాఖ ద్వారా 2,04,345 మెట్రిక్ టన్నుల సేకరణ
- లక్ష్యం 3.50 లక్షల మెట్రిక్ టన్నులు
- వానాకాలం దిగుబడి అంచనా 4.14 లక్షల మెట్రిక్ టన్నులు
- బహిరంగ మార్కెట్‌లో అనుకూల ధరతో తగ్గిన లక్ష్యం
- ధాన్యం దిగుబడి విలువ రూ.750 కోట్లు
- పౌరసరఫరాల శాఖ సేకరించిన ధాన్యం విలువ రూ.450 కోట్లు



ధాన్యం కొనుగోళ్లు చేస్తున్న దృశ్యం (ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా పౌరసరఫరాల శాఖ ఏర్పరుచుకున్న లక్ష్యం అందుకోలేకపోయింది. బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి అనుకూల ధర రావడంతో రైతులు నేరుగా మిల్లర్లకే అమ్ముకున్నారు. కొనుగోలు కేంద్రాలకు భారీ తాకిడి లేకుండానే ధాన్యం కొనుగోళ్లు ముగిసిపోయాయి. తుఫాను, వడగళ్ల వర్షాలు రైతులను భయపెట్టినా దిగుబడి అనుకూలంగానే వచ్చింది. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.40 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేయగా 1.74 లక్షల ఎకరాల్లో వరి వేశారు. ఈసారి దిగుబడి నాణ్యతగా ఉండడంతో రైతుల వద్ద మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోళ్లు చేశారు. అమ్మడానికి రైతులు కూడా ఆసక్తి చూపారు. దాదాపు దిగుబడి విలువ రూ.750 కోట్ల వరకు ఉండగా పౌరసరఫరాల శాఖ రూ.450.17 కోట్లు కొనుగోలు చేసింది.



ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు (ఫైల్)

● పౌరసరఫరాల శాఖ కొన్నది 2,04,345 మెట్రిక్ టన్నులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలానికి సంబంధించిన ధాన్యం దిగుబడి అంచనా 4.14 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నా 39,707 మంది రైతుల నుంచి 2,04,345 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉండగా 254 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వీటి ద్వారా ఐకేపీ 44 కేంద్రాల ద్వారా 41,759 మెట్రిక్ టన్నులు, 196 సింగిల్ విండోల ద్వారా 1,55,112 మెట్రిక్ టన్నులు, 10 డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా 5093 మెట్రిక్ టన్నులు, నాలుగు మెప్మా కేంద్రాల ద్వారా 2380 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఈసారి రైతులు ఇబ్బందులకు గురి కాకుండానే కొనుగోళ్లు పూర్తి చేశారు. పౌరసరఫరాల శాఖ 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా వేయగా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయలేకపోయింది.

● రైతులకు రూ.441.55 కోట్ల చెల్లింపు

జిల్లాలో 39,707 మంది రైతుల నుంచి 2,04,345 మెట్రిక్ టన్నుల ధాన్యం పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసింది. రైతులకు రూ.450.17 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు 39,249 మంది రైతుల ఖాతాల్లో రూ 441.55 కోట్లు జమ చేశారు. ఐకేపీ ద్వారా రూ.92 కోట్లు, సింగిల్ విండోల ద్వారా రూ.341.77 కోట్లు, డీసీఎంఎస్ ద్వారా రూ.11.22 కోట్లు, మెప్మా ద్వారా రూ.5.24 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

న్యూ ఇయర్ వేళ రూ.3.78 కోట్ల మద్యం తాగేశారు

సిరిసిల్ల క్రైం, జనవరి 1: జిల్లాలో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మద్యం ప్రియులు రూ.3.78 కోట్ల మద్యం తాగేశారు. డిసెంబరు 30, 31న రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న 48 వైన్స్‌లలో రూ.3.78కోట్ల విలువైన 3256 లిక్కర్ బాక్స్‌లు, 6221బీర్ బాక్స్‌ల విక్రయాలు సాగాయి. అదేవిధంగా ఏడాదిలో రూ.504.70కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. 1 జనవరి 2023 నుంచి 31 డిసెంబరు ,2023 వరకు జిల్లాలోని 48 వైన్స్‌ల ద్వారా 4,35,728లిక్కర్ బాక్స్‌లు, 9,98,873 బీర్ బాక్స్‌లు విక్రయించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరిసిల్ల టౌన్, జనవరి 1: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆర్బీఐ అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సోమవారం సామాజిక సేవా కార్యకర్త వేముల మార్కండేయులు ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని కార్మిక వాడలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ పీఆర్‌వో హరీష్ మాట్లాడుతూ సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్ మీతోనే మొదలు అవుతుందని, లావాదేవీలతో జాగ్రత్త వహించాలని అన్నారు. పాస్‌వార్డ్ పిన్ను, ఓటీపీ, సీవీవీ ఎవరికీ చెప్పవద్దన్నారు. బ్యాంకు స్కీంలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పద్మశాలి జాతీయ సేవాదల కన్వీనర్ మేర్గు శ్రీనివాస్, రాములు, శ్రీనివాస్, అంజనేయులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, జనవరి 1:ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని పిట్ల ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా మేకలకాడ మల్లయ్య కోశాధికారిగా మధు ఎన్నికయ్యారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

విలీన గ్రామాల్లో కుల సంఘాల తీర్మానాలు

- గ్రామ పంచాయతీలుగా మార్చాలని విజ్ఞప్తి

సిరిసిల్ల రూరల్, జనవరి 1: వార్డులుగా మార్చిన తమ గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మార్చాలంటూ కుల సంఘాల్లో నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో తీర్మానాలు చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో విలీనం చేసిన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మార్చాలంటూ కుల సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. స్టే తెచ్చుకున్నా అప్పటి రాజకీయ నాయకుల అండదండలతో ఈ గ్రామాలను సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేశారు. అక్కడి ప్రజలకు ఉపాధి దూరమవడంతోపాటు పట్టణ కష్టాలు మొదలయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మారుస్తానంటూ ప్రకటించారు. బాండ్ పేపర్ రాసి ఇచ్చారు. అంతేకాకుండా సిరిసిల్ల పట్టణంలో జరిగిన బీఆర్‌ఎస్ రోడ్ షోలో కేటీఆర్ ప్రజల కోరిక మేరకు విలీన గ్రామాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత డిసెంబరు 30న సిరిసిల్ల మున్సిపల్‌లో జరిగిన సమావేశంలో విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం మార్చాలంటూ తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా 1వ తేదీన ఈ గ్రామాల్లోని కులాలవారీగా జరిగే కుల సంఘాల్లో అక్కడి నాయకులు ప్రజలు ఏకతాటిపైకి వచ్చి గ్రామాలుగా ఉన్నప్పుడు ఉన్న ఉపాధి పట్టణాలుగా మారిన తరుణంలో పోయిన ఉపాధిను గుర్తించి తమ గ్రామాలను సిరిసిల్ల మున్సిపల్ నుంచి విడదీసి గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి మండలంగా ప్రకటించాలంటూ తీర్మానం చేస్తున్నారు. ఈ తీర్మాన కాపీలను త్వరలోనే వివిధ పార్టీల రాజకీయ నాయకులతోపాటు అధికారులకు అందజేయనున్నట్లు కుల సంఘాల నాయకులు తెలిపారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి



సుద్దాలలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, జనవరి 1: అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రుద్రంగి మండల కేంద్రంలోని చర్చిలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభు దీవెనలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. తన గెలుపుకోసం చర్చ్ ప్రార్థనలు చేసిన పాస్టర్లకు, క్రైస్తవులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, సూర యాదయ్య, మాడిశెట్టి అభిలాష్, గుగ్గిల వెంకటేష్, పూదరి మహిపాల్ ,గంధం మనోజ్, మహేష్, తర్రె లింగం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల పరామర్శ

రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నంద్యాడపు బుచ్చిమల్లయ్య గుండెపోటు మృతి చెందగా, గడ్డం రాజవ్వ అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు.

ఆధ్యాత్మికతతో మనశ్శాంతి

కోనరావుపేట : ఆధ్యాత్మికతతో ఉన్నప్పుడే మనకు మనశ్శాంతి లభిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సుద్దాల చర్చిలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ స్వామి దాసు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలకు ఆదర్శంగా ఉంటుందని, దైవ సంకల్పం ఉన్నప్పుడే ఏదైనా సాధిస్తామని అన్నారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసినప్పుడు ఆరోగ్యంతోపాటు మనశ్శాంతి కలుగుతుందన్నారు. అనంతరం కోనరావుపేట ఎస్సై అంజనేయులు నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, నందు గౌడ్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ మండల నాయకులు సంజు, నీరటి సురేష్, ఎర్రవెల్లి విజయ్, ఎర్రబెల్లి నాగరాజు, బాధనేని బాలరాజు, ఆపురం సురేష్, కాదాసు సుధాకర్, సుంకరి రెడ్డి, సాసాల రాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఆది శ్రీనివాస్

కన్నుల పండువగా మండల మహా పడిపూజ



స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న అయ్యప్ప భక్తులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 1: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మండల మహా పడి పూజ మహోత్సవం సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రంలో స్వామివారి పల్లకి సేవను గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. భక్తుల మేళాతాళాలు, దీక్షపరుల నృత్యాలతో మణికంఠుడి యాత్ర శోభాయమానంగా సాగింది. స్థానిక మార్కండేయ ఆలయం నుంచి మొదలైన ఊరేగింపు అయ్యప్ప ఆలయం వరకు చేపట్టారు. ఆలయంలో గణపతి హోమం, అభిషేకం, తిరువాభరణాల ఊరేగింపు, తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామియే..శరణం అయ్యప్ప అంటూ మహిళలు మంగళహారతులు సమర్పించారు. శరణు ఘోషతో ఎల్లారెడ్డిపేట గ్రామం మార్మోగింది. రాజు, శ్రీను గురుస్వాముల ఆధ్వర్యంలో మండల మహా పడి పూజను కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం మాలదారులు నవీన్, దాస్, వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బొమ్మకంటి జ్యోతి- భాస్కర్ దంపతులు భక్తులు, దీక్షపరులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కోనరావుపేట, జనవరి 1: కోనరావుపేట మండలం సుద్దాలలోని చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం అర్చకులు మంగళగిరి లక్ష్మయ్య ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస్, చక్రపాణి, వేణు తదితరులు ఉన్నారు.










స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాజు

ఎల్లారెడ్డిపేట, జనవరి 1: స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎల్లా రెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మారుపాక రాజు సోమవారం నియమితులయ్యారు. జిల్లాలో స్వేరోలను పటిష్టపర్చడంతో రాజు కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా రాజు స్వేరో నెట్‌వర్క్‌లోని అన్ని అనుబంధ సంఘాలను కలిపి ఒక సంఘంగా ఏర్పాటు చేశారని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.









పోలీసు సేవా పతకాలకు పలువురి ఎంపిక

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు సేవా పతకానికి జగిత్యాల జిల్లా నుంచి ఆరుగురు పోలీసు అధికారులు, ఉద్యోగులు ఎంపికయ్యారు. సోమ వారం రాష్ట్ర హోం శాఖ ప్రకటించిన సేవా పతకాలకు జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ మహమ్మద్ సామ్ దానీ, మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ శ్రీపెరంబదూరు ఆంజనేయులు, జగిత్యాల దరూర్ క్యాంపు లో పనిచేస్తున్న ఏఆర్ ఎస్ఐ వెన్నంపల్లి రవీందర్, కోరుట్ల అటాచ్డ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అవుదుర్తి తిరుపతి, వెల్గటూరు హెడ్ కానిస్టేబుల్ అత్రం బహదూర్ షా ఎంపికయ్యారు. మెట్‌పల్లి ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు స్టేట్ ఫైర్ సర్వీస్ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు.

● రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

సిరిసిల్ల క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లాలో నలుగురు పోలీసు అధికారులు, ఒక ఫైర్ అధికారి పోలీస్ ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. జిల్లాలో పోలీసుశాఖలో పని చేస్తున్న పున్నం మహేందర్‌రెడ్డి (ఏఆర్ ఎస్ఐ), ఎం రాజ్‌కుమార్ (ఏఆర్ హెచ్‌సీ), గొంటి ప్రభాకర్ (రుద్రంగి హెడ్ కానిస్టేబుల్), గోనె తిరుపతి (ఏఆర్ హెచ్‌సీ), కె మహేం ద్రాచారి (ఫైర్‌మెన్, వేములవాడ) సేవా పతకాలకు ఎంపికయ్యారు.

● రామగుండం కమిషనరేట్‌లో..

కోల్‌సిటీ: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురికి పోలీస్ సేవా పతకాలు లభించాయి. ఏఆర్ఎస్ఐ కాంపెల్లి లింగయ్య, మంచిర్యాల ట్రాఫి క్ ఎస్ఐ నీరటి రామరాజు, తాళ్లగురిజాల ఏఎస్ఐ మామిడి రాజన్న, పెద్దపల్లి ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ నీర్ల వేణుగోపాల్, లక్సెట్టిపేట హెడ్ కానిస్టేబుల్ ఇష్తాకర్ అహ్మద్, దండేపల్లి హెడ్ కానిస్టేబుల్ అజ్మీరా గంగ్యా నాయక్‌లు పతకాలకు ఎంపికయ్యారు.

రేపు కరీంనగర్ జోన్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 1: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉదయం 9 గంటలకు నగునూరులోని గ్రామీణ క్రీడా ప్రాంగణంలో కరీంనగర్ జోన్ స్థాయి అండర్-14 బాలబాలికలకు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల ను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పోతన శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఫొటోపై హెడ్‌మాస్టర్ సంతకం చేసిన ఎలి జిబులిటీ ఫాం, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తో హాజరు కావాలని సూచించారు.

రేపు కట్కాపూర్‌కు కేంద్ర బృందం రాక

రాయికల్, జనవరి 1: మండలంలోని కట్కాపూర్ పల్లె దవాఖానాను ఈ నెల 3న కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ నాణ్యతా ప్రమాణాల పరిశీలన (ఎన్‌క్వాస్)లో భాగంగా బృందం పరిశీలించి ఏడు విభాగాల్లో అందుతున్న సేవలను, రికార్డులను పరిశీలిస్తారని చెప్పారు. ఆయా విభాగంలో ఉన్నత మార్కులు సాధిస్తే యేటా మూడేళ్ల పాటు నిధులు మంజూరవుతాయన్నారు. జాతీయ గుర్తింపు పొందడానికి పల్లె దవాఖానాను సిద్ధం చేశామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

జగిత్యాల రూరల్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆల యంలో పూజలు చేయడానికి స్కూటీ పై వెళ్తున్న మహిళను మృత్యువు కబళిం చింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల పట్టణంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన సామ సుజాత (42) తన స్కూటీ పై జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస ఆలయంలో పూజలు చేయడానికి బయ ల్దేరింది. పొలాస వద్ద గల ఆలయ కమాన్ సమీపంలో ధర్మపురి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు సుజాతను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే ఉన్న స్థానికులు సుజాతకు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండాపోయింది. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సుజాతకు కూతురు ఉంది. సుజాత భర్త హేమేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

మహాలక్ష్మి స్కీంపై ఆర్టీసీ సిబ్బందికి సూచనలు

భగత్‌నగర్, జనవరి 1: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ జోన్ ఈడీసోమవారం మహాలక్ష్మి స్కీంపై సిబ్బందికి సూచనలు అందజేశారు. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆవరణలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆర్టీసీ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానిక్) ఎం సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, బస్టాండ్ ఎంటీఎం రజనీకృష్ణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, వి మల్లయ్య, ఏటీఎం కార్గో ఎస్ సదాశివ, బస్టాండ్ అసిస్టెంట్ మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు.

కిందపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 1: కరీంనగర్ కట్టరాంపూర్‌లోని ఒక అపార్ట్ మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గొర్రె లక్ష్మీరాజం(55) కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని ఒకటో టాణా పోలీసులు తెలిపారు. కిసాన్‌నగర్‌కు చెందిన లక్ష్మీరాజం కట్టరాంపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో వాచ్ మన్‌గా ప ని చేస్తున్నాడు. డిసెంబరు 29న మధ్యాహ్నం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఆంజనేయులుకు చెందిన ఆవుదూడ బయటకు పరుగెడుతుం డగా అడ్డుగా పోయి తాడు కాళ్లకు తట్టుకుని కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హైదరాబాద్ నిమ్స్‌కు తర లించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దూడ యజమాని ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య కనకతార పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మానేరులో చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


దాసరి శ్రావణ్(ఫైల్)

గన్నేరువరం, జనవరి 1: లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ చందా నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రావణ్(22) సోమవారం ఉదయం లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. రోజు లాగే శ్రావణ్ ఉదయం 6గంటలకు బైక్‌పై చేపల వేటకు డ్యాంకు వెళ్లి మధ్యాహ్నం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి వెంకటయ్య మరికొంత మందితో కలిసి తెప్పలపై మానేరు నీటిలో వెతకడంతో యువకుడి మృతదేహం లభ్యమైంది. తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నూతన సంవత్సరం రోజే యువకుడు మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

● మల్యాల యువకుడి మృతి


అరుణ్‌కుమార్(ఫైల్)

చందుర్తి, జనవరి 1: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. మల్యాలకు చెందిన నేదూరి అరుణ్‌కుమార్ (28) అనే యువకుడు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో పాల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై పాలను సరఫరా చేసేందుకు వెళ్తున్నాడు. మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొన్ని సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన అనూష అనే యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. అరుణ్‌కుమార్‌కు తల్లిదండ్రులు చంద్రయ్య, లక్ష్మీనర్సవ్వ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి

ఇల్లంతకుంట, జనవరి 1: మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన ఎలవేని పర్శరాం (55) అనే మత్స్యకారుడు సోమవారం రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పర్శరాం సోమవారం ఉదయం చేపలు పట్టడానికి ద్విచక్రవాహనంపై మధ్యమానేరుకు బయల్దేరాడు. వల్లంపట్ల గ్రామసమీపంలో ప్రమదవశాత్తు వాహనం పైనుంచి రోడ్డు పక్కన ఉన్న బురదలో పడి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 1: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన అర్నకొండ మల్లమ్మ (80) అనే వృద్ధురాలు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ తెలిపారు.

రాజన్న సేవలో ప్రముఖులు


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

వేములవాడ, జనవరి 1 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కొత్త ఇన్నోవా వాహనానికి రాజన్న సన్నిధిలో సోమవారం సాయంత్రం ఆది శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వామివారిని దర్శించుకొని కోడె మొక్కు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో జడ్పీ చైర్ పర్సన్

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అర్చకులు ఆశీర్వచనం గావించారు.

రాజన్న సేవలో ఎన్నికల పరిశీలకుడు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికల పరిశీలకుడు మణిగండ స్వామి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేశారు.

రాజస్థాన్‌లో ఆర్మీ జవాన్ మృతి

● జగ్గారావుపల్లిలో విషాదం


శివకుమార్ (ఫైల్)

బోయినపల్లి, జనవరి 1: బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ చాడ శివకుమార్ (23) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. శివకుమార్ సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. బంధువులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివకుమార్ రెండేళ్ల క్రితం సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగం పొందాడు. రాజస్థాన్‌లోని డిలోలిలో 16వ బెటాలియన్‌లో డాక్యుమెంటరీ సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తుండగా డిసెంబరు 16న బాత్ రూమ్‌లో జారీ కిందపడ్డాడు. తలకు గాయమై కోమాలోకి వెళ్లాడు. తోటి సిబ్బంది జైపూర్‌లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. శివకుమార్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దసరా పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన శివకుమార్ అనంతరం తిరిగి విధులకు వెళ్లాడు. ఇటీవల తెలంగాణలో నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. శిక్షణకు సమయం ఉండడంతో తిరిగి రాజస్థాన్ వెళ్లి విధుల్లో చేరాడు. శివకుమార్ తల్లిదండ్రులు ఇద్దరు గోపాల్‌రెడ్డి భాగ్యమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోదరుడు గంగారెడ్డి సిరిసిల్లలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శివకుమార్ మృతితో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.

ప్రమాదకరంగా రహదారి

● వారం వ్యవధిలో వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి
● కనిపించని హెచ్చరిక బోర్డులు

హుజూరాబాద్ రూరల్, జనవరి 1: హుజూరాబాద్ మండలం మీదుగా వెళ్తున్న ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారుతోంది. వారం వ్యవధిలో వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మండలంలోని తుమ్మనపల్లి శివారులో డిసెంబరు 27న సింగాపూర్ గ్రామానికి చెందిన గాడి అనిల్‌రెడ్డి(29) స్వగ్రామానికి వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై వస్తున్న క్రమంలో ఓ లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డిసెంబరు 28న అర్ధరాత్రి జాతీయ రహదారి పనుల్లో కూలీ పనిచేస్తున్న వినోద్ కోలే(29) తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పనినిమిత్తం బయటికి వెళ్లి తిరిగి సింగాపూర్‌కు వెళ్తున్న క్రమంలోనే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో వినోద్ కోలే అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని తుమ్మన్నపల్లి, సింగాపూర్ గ్రామాల సమీపంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జమ్మి కుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై శాలపల్లి-ఇందిరానగర్, చెల్పూర్, రంగాపూర్, సిర్సపల్లి, పర్కాల్ క్రాస్, కందుగుల, దమ్మక్కపేట క్రాస్‌లు డేంజర్ స్పాట్‌గా మారాయి.


రంగాపూర్‌లో జమ్మికుంట-హుజూరాబాద్ రహదారిపై ప్రమాద దృశ్యం(ఫైల్)

రక్షణ చర్యలు చేపట్టాలి

- బాషవేణి రాజేష్‌యాదవ్, సింగాపూర్



సింగాపూర్ శివారులో రాత్రి పూట ప్రధాన రహదారిపై బైక్‌తో వెళ్లాలంటే భయపడుతున్నాం. భారీ వాహనాలు వేగంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. డేంజర్ స్పాట్‌ల వద్ద అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి.

వాహనదారులు నిబంధనలను పాటించాలి

-సిరాజ్ ఉర్ రహమాన్, ఎంవీఐ, హుజూరాబాద్



ప్రతి వాహనదారుడు నియమ నిబంధనలు పాటించాలి. స్పీడ్ బ్రేకర్ల వద్ద, మూల మలుపుల వద్ద, టర్నింగ్ పాయింట్లు, సైడ్ తీసుకుంటున్న సమయంలో ఇండికేటర్‌లను తప్పనిసరిగా వినియోగించాలి. రాత్రిపూట లైట్స్ లేకుండా వాహనాలను నడపవద్దు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి,జనవరి 1: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రేకొండలోని హాళిక్ శ్రమజీవి కోఆపరేటివ్ సొసైటీలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా సీపీఐ బలోపేతం అవుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ పార్టీని గద్దె దించడమే సీపీఐ ఏకైక లక్ష్యం అన్నారు. మతం, కులం పేరుతో పనిచేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే ఏ పార్టీని సహించేది లేదన్నారు.

ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, ఎంపిటిసి అందె స్వప్న-స్వామి, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, సొసైటీ చైర్మన్ మండల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

వెల్గటూర్, జనవరి 1: మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన భూపెల్లి పోచమ్మ (64) అనే మహిళ సోమవారం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు పోచమ్మ సంవత్సర కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధ పడుతోంది. వ్యాధి నివారణకు చికిత్స నిమిత్తం ప్రతి రెండు రోజులకు ఒకసారి కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి కీమో థెరపీ చేయించుకునేది. నాలుగు రోజులుగా వ్యాధి తీవ్రత పెరగడంతో భరించలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. పోచమ్మ భర్త భూపెల్లి గంగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నందగిరిని కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలి


దేవాలయాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరాజు

గంగాధర, జనవరి1: కరీంనగర్ జిల్లాలో కోట్ల నర్సింహులపల్లిలో విశేష చారిత్రక, సాంస్కృతిక వారసత్వం కలిగిఉన్న ప్రాంతాన్ని నందగిరితో కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని చరిత్ర పరిశోధన సమితి కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని గంగాధర మండలం కోట్ల నర్సింహులపల్లిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వ సంపదను కలిగి నాటి నుంచి నేటి తరానికి దిక్సూచిగా నందగిరి కోట, కోట్లనర్సింహులపల్లి వీరభద్ర దేవాలయం, నరసింహుని దేవాలయాలతో పాటు జైనుల సంపద ఉందన్నారు. క్రీ.పూర్వం 3వ శతాబ్దం నుంచి జైన, వైష్ణవ మత సామరస్యానికి వేదికగా ఎందరో రాజులు పాలించిన కేంద్రంగా విరసిల్లిందన్నారు. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి పరుచుటకు చొరవ చూపాలన్నారు.చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలైన కోటిలింగాల, బొమ్మలమ్మ గుట్ట, నందగిరి, ధర్మపురి,వేముల వాడను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ విధంగా చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగి ఈ ప్రాంతానికి ప్రాధాన్యతతో పాటు ఆదాయం, అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, జనవరి 1: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆంగ్ల నూతన సంవత్సరం తొలిరోజు కావడం, మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తుండడం కారణంగా పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ అధికారులు గర్భాలయంలోకి ప్రవేశం నిలిపివేసి లఘు దర్శనం అమలు చేశారు. సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయం లోకి ప్రవేశించిన భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకు న్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఈ సందర్భంగా భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ నేతృత్వంలో ఆలయ పర్యవేక్షకులు బి.తిరుపతి రావు, అల్లి శంకర్, పరిశీలకులు అశోక్, పవన్ తగిన ఏర్పాట్లు చేశారు. సోమవారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, దాదాపు 20 లక్షల మేరకు ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

గోదావరిఖనిలో కూలీ హత్య

కోల్‌సిటీ, జనవరి 1: గోదావరిఖని సప్తగిరికాలనీ మున్సిపల్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సమీపంలో ఆదివారం రాత్రి వెనచర్ల గంగాధరరావు(30) అనే కూలీ హత్యకు గురయ్యాడు. గంగాధర్‌రావు, అభితేజ అనే ఇద్దరు మద్యం సేవిస్తున్న సమయంలో గొడవ పడినట్లు తెలుస్తోంది. పరస్పరం దూషించుకోగా అభితేజ గంగాధర్‌రావు తలపై రాడ్‌తో కొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అభితేజ 108కు సమాచారం ఇచ్చాడు. 108 సిబ్బంది వచ్చే సరికే గంగాధరరావు మృతి చెందాడు. దీంతో అభితేజ, అతని భార్య సునీత పరారయ్యారు. అభితేజ వేములవాడలో ఒక బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు. పిల్లలు లేని అతడు పెంచుకునేందుకు బాలుడిని తీసుకెళ్లడంతో కేసు నమోదు అయ్యింది. మృతుడు గంగాధర్‌రావు స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం. అతని బంధువులకు సమాచారం ఇచ్చినట్టు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు.

ఇస్కాన్ మందిరంలో ఘనంగా పుష్పోత్సవం


పెద్దపూర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఉత్సవమూర్తులు


కోరుట్లలో అయ్యప్పస్వామికి లక్షపుష్పార్చన

మెట్‌పల్లి రూరల్, జనవరి, 1 : మండలంలోని పెద్దపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరంలో స్వామి వారికి పుష్పోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి కన్నుల పండుగగా నిర్వహించారు. పుష్పోత్సవ కార్యక్రమానికి ముంబాయి, హైదరాబాద్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు పాల్గొని స్వామి వారిని సందర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలు రకాల పుష్పాలతో రాధా కృష్ణులకు అభిషేకం చేశారు. నిర్వాహకులు శ్రీమాన్ నరహరి ప్రభుజి ప్రవచనం ఇచ్చారు. భక్తులు నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కోరుట్లలో లక్షపుష్పార్చన

కోరుట్ల : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం లక్ష పుష్పార్చన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో వేదపండితుడు పాలెపు రాంశర్మ, వినయ్ మంత్రోచ్ఛరణ మధ్య లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. మూల విరాట్‌కు అభిషేకం, అర్చన, పంచామృత అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అయ్యప్పకు లక్ష పుష్పార్చన మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. అయ్యప్ప అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయం గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణలతో పాటు పలువురు అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు, అయ్యప్ప స్వాములకు బిక్షను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పత్తి అమ్మకానికి ఆన్‌లైన్ చిక్కులు

● వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం
● రైతులకు తప్పని అవస్థలు


జమ్మికుంట మార్కెట్‌కు వచ్చిన పత్తి వాహనాలు

జమ్మికుంట, జనవరి 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో పత్తి అమ్ముకునేందుకు వస్తున్న రైతులకు ఆన్‌లైన్ చిక్కులు తప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు పత్తి పంటల వివరాలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పత్తి అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వస్తున్న రైతులకు తమ పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. పేరు కనిపించినా, పంట విస్తీర్ణం తక్కువగా నమోదై ఉంటుంది. దీంతో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. కనీస మద్దతు ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

సీసీఐ ద్వారా ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి సేకరణ

ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతుల నుంచి సీసీఐ సేకరిస్తోంది. అంతకు మించి అదనంగా క్వింటాల్ పత్తి కూడా సదరు రైతు సీసీఐకి విక్రయించుకునే పరిస్థితి లేదు. తక్కువ పంట విస్తీర్ణం నమోదైన రైతులు ఇతర రైతుల పేరు మీద అమ్ముకునే వెసులు బాటు ఉంది. ఆ రైతు తన పంటను మళ్లీ సీసీఐకి విక్రయించుకునే అవకాశం ఉండదు. మళ్లీ ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

సుల్తానాబాద్, జనవరి1: సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో చుక్క రాజు (31) అనే రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన చుక్క రాజు సోమవారం ఉదయం తన పొలానికి నీరు పెట్టడం కోసం ఇంటి నుంచి వెళ్లాడు. ఆలస్యమైనా ఇంటికి రాకపోవడంతో ఆయన ఆచూకీ కోసం చూడగా పొలం వద్ద మడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. ఏదైనా అనారోగ్య కారణాలతో చనిపోయాడా లేక మరేదైనా కారణాలతో మృతి చెందాడో తెలియాల్సి ఉంది. ఈ మేరకు మృతుడు రాజు భార్య శైలజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంట నష్టపరిహారం వచ్చేనా?

● కొత్త ప్రభుత్వంపై ఆశలు ● వేలాది మంది రైతుల ఎదురుచూపులు


చామంటలో నేలరాలిన పచ్చిమిర్చి(ఫైల్)


చొప్పదండిలో ధ్వంసమైన వరి పంట(ఫైల్)

చొప్పదండి, జనవరి 1: గత ఏడాది ఏప్రిల్ చివరివారంలో కురిసిన వడగళ్ల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆరుగాలం శ్రమించిన పంటకాస్త అరగంట కురిసిన వడగళ్ల వర్షం ధాటికి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. పెట్టిన పెట్టుబడి కాస్త భూమిపాలుకాగా అన్నదాత తీవ్రంగా నష్టపోయాడు. కనీసం వరిపొలం కోసే పరిస్థితి లేకుండా తగలబెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10 వేల రూపాయలు నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రకటించి, నష్టపోయిన పంట పొలాలను సర్వే చేశారు. అధికారులు పంట నష్టజాబితాను ప్రభుత్వానికి నివేదించగా ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పంట నష్టపరిహారం రైతులకు అందలేదు. మండలంలో ఏప్రిల్ చివరి వారంలో కురిసిన వడగళ్ల వర్షం దాటికి 5,083 ఎకరాల్లో వరి, కూరగాయలతోపాటు ఇతర పంటలు పూర్తిగా ధ్వంసమైపోయాయి. చొప్పదండిలో 1,140 ఎకరాలు, వెదురుగట్టలో 1,789 ఎకరాలు, చాకుంటలో 460 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రుక్మాపూర్‌లో 392 ఎకరాల్లో, కొలిమికుంటలో 342, చిట్యాలపల్లిలో 124, గుమ్లాపూర్‌లో 342, మొత్తం 5,083 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 6,023 మంది రైతులు పంట నష్టపోగా, పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగా రైతులు పంట నష్ట పరిహారం వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆరు గ్యారెంటీలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, జనవరి 1 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలోని చర్చిలో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషి చేసినవారికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం కుమార్, సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, ప్రభాకర్, హనుమంతు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్ పర్సన్

సిరిసిల్ల టౌన్, జనవరి 1: ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 క్యాలెండర్‌ను సోమవారం సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి ఆవిష్కరించారు. ముందుగా కేడీసీసీ సిరిసిల్ల బ్రాంచ్ మేనేజర్ దామోదర్, బ్యాంక్ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్ పుష్పగుచ్ఛాలతో చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎల్ఐసీ ఏజెంట్ కూర శ్రీధర్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఎల్ఐసీ డీవో మహిపాల్, బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, బీఆర్ఎస్ 15వ వార్డు అధ్యక్షుడు గొట్టె అంజయ్య, కేడీసీసీ సిరిసిల్ల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా భావాన్ని చాటిన విద్యార్థులు


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గంభీరావుపేట, జనవరి 1: గంభీరావుపేట మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు కొత్త సంవత్సరం రోజున సేవాభావాన్ని చాటారు. కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.18 వేలతో అనాథ వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అంద జేశారు. చిన్ననాటి నుంచి పిల్లల్లో సేవాభావాన్ని పెంపొందించి వృద్ధుల పట్ల గౌరవం, ఆప్యాయత చూపేలా ప్రోత్సహిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎనిమిదేళ్లుగా అనాథ వృద్ధులకు విద్యార్థులు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారని ఆశ్రమ నిర్వాహకకుడు మల్లుగారి నర్సాగౌడ్ వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్, పద్మజ, దేవరాజు, రాజు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న ప్యాక్స్ డైరెక్టర్

తంగళ్లపల్లి, జనవరి 1: ఐదోసారి కేటీఆర్ గెలుపొందడంతో ప్యాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్‌యాదవ్ తిరుపతి వెంకన్నకు మొక్కు చెల్లించుకున్నారు. ఎన్నికలకు ముందు కేటీఆర్ ఐదోసారి గెలుపొందితే తిరుపతికి వస్తానని మొక్కుకున్నట్లు దేవేందర్ తెలిపారు. సోమవారం తిరుపతి వెంకన్నను దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నట్లు పేర్కొన్నారు.

నిరుపేద యువకుడి వైద్యానికి ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట, జనవరి 1: మండల కేంద్రానికి చెందిన రొడ్డ శ్రీకాంత్ అనే నిరుపేద యువకుడి వైద్యానికి ఎస్ఆర్ఐ అంతగిరి అశోక్‌కుమార్ సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీకాంత్ అనారోగ్యంతో బాధపడుతూ కొంతకాలంగా మంచానికే పరిమితం అయ్యాడు. విషయం తెలుసుకున్న అశోక్ రూ.5వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంతగిరి అంజయ్య, మామిడి రాజు, రామకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

గంభీరావుపేట, జనవరి 1: గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతిచెందాయి. గ్రామ శివారులో ఉన్న మానేరు వాగులో మోటార్లకు చెందిన తీగలు ఉన్నాయి. మానేరు వాగులోకి నీళ్లు తాగేందుకు వెళ్లిన గొర్రెలు తీగలు తగిలి అక్కడిక్కడే మృతిచెందాయి. మరికొన్ని గొర్రెలు వాగులోకి వెళ్తుండగా ప్రమాదాన్ని గమనించిన రాజు వాటిని ఆపాడు. రాజుకు కూడా కొద్దిలో ప్రమాదం తప్పినట్లయ్యింది. ఈ ప్రమాదంలో రూ.25 వేల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం పరిహారం అందించాలని గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు బొంగు మల్లేశం కోరారు.

అంబరాన్నంటిన సంబరం

- వాడవాడనా న్యూ ఇయర్ వేడుకలు
- ఉత్సాహంగా కొత్త సంవత్సరానికి స్వాగతం
- కిటకిటలాడిన దేవాలయాలు
- ఇళ్లలోనే సంబరాలు - పోలీస్ బందోబస్తు, తనిఖీలు
- తెల్లవారుజాము వరకు సందడి


తిప్పాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


నిమ్మపల్లిలో కేక్ కట్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణరాఘవరెడ్డి


కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ


సంబరాల్లో ఎస్పీ అఖిల్‌మహాజన్, పోలీసులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కొత్త ఆశలతో జిల్లా ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు సంబరాలు జరుపుకున్నారు. ఫుల్ జోష్‌గా ఇళ్లలో కేక్‌లు కట్ చేస్తూ పార్టీలు చేసుకున్నారు. సోమవారం ఉదయం దేవాలయాలకు వెళ్లి దర్శనాలు చేసుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, సిరిసిల్లలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం, హరిహరపుత్ర అయ్యప్ప దేవాలయం, శివసాయిబాబా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రతీ ఇంటి ముంగిట రంగవల్లులతో మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మద్యం దుకాణాలు, బేకరీల వద్ద రద్దీ నెలకొంది. పోలీసులు నిరంతరం బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో కేక్ కట్ చేశారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలు నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపాయి.

సిరిసిల్ల రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని, నూతనం సంవత్సరం జరిగే పరీక్షల్లో ఉత్తీర్ణతలను సాధించి ముందుకు సాగాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందంకళా చక్రపాణి కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు పెద్దూరు శివారులోని కస్తూర్బా విద్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో విద్యార్థులతోకలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావవస్థ అభివృద్ధికి 'మన ఊరు-మన బడి, మనబస్తీ- మనబడి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని, అందరికీ ఉచిత విద్యను అందించిందని అన్నారు.

ఇల్లంతకుంట: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మండలకేంద్రంలో సోమవారం ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. పలు గ్రామాలలోని ఆలయాలకు భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రతీ ఒక్కరి జీవితంలో ఆనందం వెల్లివిరియాలని కోరారు. లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, నాయకులు గుర్రం భూపతిరెడ్డి, నవీన్‌రెడ్డి, మాధవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సృజన్‌రెడ్డి, మామిడి రాజు, కొమురయ్య, దేవేందర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఎల్లారెడ్డిపేట మండలంలో అంబరాన్నంటాయి. మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, నారాయణపూర్, బొప్పాపూర్, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, అక్కపల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాలు వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో చిరంజీవి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వీర్నపల్లి : మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని పలు చర్చీల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం రాత్రి ఎస్సై నవత ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.


కస్తూర్బా పాఠశాలలో కేక్‌కట్ చేస్తున్న చైర్‌పర్సన్

వేములవాడ రూరల్: వేములవాడ రూరల్, అర్బన్ మండలాలలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ వార్డులో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ప్రభుత్వ విప్, శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో గుడ్ న్యూస్ బాప్టిస్ట్ చర్చిలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి, బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు సెస్ వైస్‌చైర్మన్ తిరు పతి, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్, పాస్టర్ సోమయ్య, జయలక్ష్మి పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండలంలోని ఆయా గ్రామాల్లో యువకులు ప్రధాన కూడలిలో కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మూడపల్లి గ్రామంలో గల సువార్త ప్రార్థన మందిరంలో కేక్ కట్ చేశారు. చిన్నారుల నాటక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాస్టర్లు నర్సింహారెడ్డి, అరుందాస్, నాయకులు పర్శయ్య, బొడ్డు దేవయ్య, లచ్చయ్య, దిలీప్, గోలి రాజేందర్, బాబు, దాస్, పవన్, దేవయ్య, రాజేందర్, పుల్కం నారాయణ, నర్సయ్య పాల్గొన్నారు.


గర్షనపల్లి వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ కరుణ రంజిత్‌కుమార్


న్యూ ఇయర్ వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న యువతులు


డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు, ఎస్పీ

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర


రథంపై ఊరేగిస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 1: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చేరుకున్న అయోధ్య రాముడి అక్షింతలతో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని గీతామందిరం నుంచి ప్రధాన వీధుల గుండా శ్రీరాముడి చిత్రపటం, అక్షింతలతో ఊరేగించారు. మహిళల కోలాటలు, భజనల నడుమ ముందుకు సాగారు. గ్రామ శివారులోని సీతారామచంద్రస్వామి ఆలయం వరకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రామజన్మభూమి పూజిత అక్షింతలను సోమవారం ఇల్లంతకుంట, సోమారంపేట గ్రామాలలో ఇంటింటికి పంపిణీ చేశారు. ఈనెల 22న రాంలలా మందిరంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, ఖండసమితి అధ్యక్షుడు ఏగుర్ల శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు మామిడి పర్శరాం, ఆర్ఎస్ఎస్ ఖండకార్యవాహ తాటిపెల్లి మహేష్, నార్ల రాంకిషన్, రవీందర్‌రావు, దుద్దెడ రాజు, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, వెంకటాచారి, సురేందర్‌రెడ్డి, గోపాలచారి, రవీందర్‌రెడ్డి, రాజేశ్వరశర్మ, దొంతుల శంకర్, , రాము, ధనుంజయ్, విజయ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు


సుద్దాలలో శోభాయాత్రలో ప్రజా ప్రతినిధులు

కోనరావుపేట: కోనరావుపేట మండలం సుద్దాల ధర్మారం గ్రామాల్లో సోమవారం అయోధ్య రామయ్య అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. సర్పంచులు దేవలక్ష్మీ, గున్నాల అరుణ, లక్ష్మణ్ ఎంపీటీసీ మమత, మహేష్, బీజేపీ నాయకులు మిర్యాల్‌కార్ బాలాజీ, అంబోజ లక్ష్మీనారాయణ, జగడి బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న అవిశ్వాసంపై సర్వసభ్య సమావేశం

చందుర్తి, జనవరి1 : చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్‌పై పలువురు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ గత నెల 23న జిల్లా సహకార అధికారి బుద్ధి నాయుడుకు నోటీసు అందజేశారు. తెలంగాణ సహకార సంఘం చట్టం 1964 నిబంధనల అనుసరించి అవిశ్వాసం నోటీస్‌పై చర్చించేదుకు, ఓటింగ్‌కు సంబంధించి ఈ నెల 17న మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

చందుర్తి, జనవరి 1: చందుర్తి మండలం లింగంపేట మున్నూరుకాపు కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కర్రె కరుణాకర్, కోశాధికారిగా ఇందూరి రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఇందూరి రాజు, బండారి వెంకటి, ఇందూరి సాయిరెడ్డి, బండారి శేఖర్, కమటం లక్ష్మీరాజం, పొనుగంటి నారాయణ, పవన్, బక్కయ్య, శ్రీరాముల రాములు ఎన్నికయ్యారు.

పురగిరి క్షత్రియ పెరిక సంఘం అధ్యక్షుడిగా దివాకర్

చందుర్తి, జనవరి 1: చందుర్తి మండలం తిమ్మాపూర్ పురగిరి క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా నల్లపు దివాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సంఘం సభ్యుల సమావేశంలో గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ బెదిరింపులకు భయపడబోం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 1: బీఆర్ఎస్ నాయకుల బెదిరింపులకు భయపడేమని, కేకే మహేందర్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ మాట్లాడారు. నిన్నటి రోజు తమ నాయకుడు విలేకరుల సమావేశం నిర్వహించి గత ప్రభుత్వం చేసిన తప్పలను వెల్లడించారని, ఆగమేఘాల మీది మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి విలేకరుల సమావేశం నిర్వహించి ప్రజలకు సంజాయిషి ఇవ్వకుండా కేకే మహేందర్‌రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు అతి ఉత్సాహం చూపడాన్ని బంద్ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా కాలేదని, అప్పుడే అనవసర విమర్శలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరంగా ఉన్న పరిస్థితులను సమీక్షించాల్సిన అవసరం కొత్త ప్రభుత్వానికి ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుగానే రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని, పెండింగ్‌లో ఉన్న పనులను ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే బతుకమ్మ చీరల బిల్లులు, పవర్‌లూం సబ్సిడీ ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అప్పటి తెలంగాణ పవర్‌లూం టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ ఎందుకు బిల్లును విడదల చేయలేదని ప్రశ్నించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటి చేసి ఓడినా కేకే మహేందర్‌రెడ్డి బతుకమ్మ బిల్లులను ఇప్పించడం కోసం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వద్దకు సిరిసిల్ల వ్యాపారులను తీసుకెళ్లారని, బిల్లులను విడదల చేయాలని కోరారని తెలిపారు. అనంతరం గొరిటాల లక్ష్మీపతిని చేనేత సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ గోనె ఎల్లప్ప నియామక పత్రాన్ని అందజేశారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

అంజన్న సేవలో అడ్లూరి, ఆది

మల్యాల, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా కొండగట్టు అంజనేయస్వామిని సోమవారం ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన విప్‌లకు దేవస్థానం అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అలయ ఈవో వెంకటేష్ సత్కరించగా అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తన నూతన వాహనానికి స్వామివారి సన్నిధిలో పూజలు చేశారు. మరోవైపు నూతన సంవత్సరం, సమ్మక్క సారక్క జాతర నేపథ్యంలో వేలాది మంది భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. కొత్త ఏడాదిలో అన్ని శుభాలే కలగాలని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

నెరవేరనున్న క్రీడాకారుల కల

- మినీస్టేడియం పనులు ప్రారంభం


మినీ స్టేడియం నిర్మించే ప్రదేశం

ఇల్లంతకుంట, జనవరి 1: అనేక సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న క్రీడాకారుల కల నెరవేరనుంది. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని 20 గుంటల స్థలంలో మినీస్టేడియం నిర్మించడానికి పనులు ప్రారంభమయ్యాయి. మండలకేంద్రంలో వివిద ఆటల్లో ప్రావీణ్యం ఉన్న క్రీడాకారులు ఉన్నారు. వారు ప్రతీరోజు ప్రాక్టీస్ చేసుకోవడానికి స్థలం లేకపోవడంతో స్థానిక నాయకుల దృష్టికి అనేకసార్లు తీసుకొచ్చారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో ఏకమైన యువకులు అధికార పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారు. ఎమ్మెల్యేగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికవడంతో ఇచ్చిన మాట ప్రకారం 20 గుంటల స్థలంలో మట్టిపోసి చదును చేస్తున్నారు. మండలంలో ఆటస్థల సమస్య తీరునుండడంతో యువకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

సంతోషంగా ఉంది



- మామిడి రాజు, యువజన సంఘాల నాయకుడు

మండల కేంద్రంలో ఆటస్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డాం, నాయకుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకవెళ్లినా హామీలు లభించాయి. సమస్య పరిష్కారం కాలేదు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని స్థలం కావాలని కోరాం. అందుకు అనుగుణంగా మట్టిపోయడం ప్రారంభించారు. పనులు వెంటనే పూర్తిచేసి ఆటస్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. క్రీడాకారుల సమస్యను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

మాట నిలుపుకున్న ఎమ్మెల్యే



- వుట్కూరి వెంకటరమణారెడ్డి, ఎంపీపీ

మండల కేంద్రంలోని యువకులకు ఆటస్థలం కేటాయిస్తానని ఇచ్చిన మాటను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిలుపుకున్నారు. ఖాళీ స్థలంలో మట్టిపోసే పనులు ప్రారంభించారు. త్వరలోనే మిగతా పనులు పూర్తిచేసి క్రీడాకారులకు స్థలం అందుబాటులోకి తీసుకొస్తాం. యువకులు ఆటలపై మక్కువను పెంచుకోవాలి. క్రీడాకారులకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుంది.